# ప్రాక్ప్

సభాపతి నీటుగా తయారై అద్దంలో చూసుకుంటూ మరొకసారి టై సర్దుకున్నాడు. బూట్ల లేసులు సరిగ్గా వున్నాయో లేదోనని చూడబోయి మెరిసే బూటులో తన ముఖం చూసుకుని సంతృప్తిగా నవ్వుకున్నాడు. బ్రీఫ్‌కేస్‌లో పేపర్లు మరొక్కసారి కలియచూసి లాక్ చేసి చేతిలోకి తీసుకున్నాడు. నిటారుగా నిలబడి దర్జాగా ముందుకు కదలబోయాడు. ఇంతలో తలుపు తోసుకుని వెంకన్న వచ్చి 'గుడ్ మార్నింగ్' చెప్పి అతని చేతిలోని బ్రీఫ్‌కేస్ వినయంగా అందుకున్నాడు. సభాపతి కదిలాడు. వెంకన్న డోర్ కర్టన్ వొత్తిగించి పట్టుకున్నాడు.

ఆ రోజు సభాపతి ఆఫీసరుగా రిపోర్టు చేస్తున్న రోజు. భవిష్యత్తు మీద ఎనలేని ఆశలతో అతని హృదయం వుక్కిరి బిక్కిరై పోతోంది.

చిన్ననాటి నుంచి సభాపతి ప్రతి విషయంలోనూ ముందు కురికే

స్వభావం కలవాడు. అతను లేమిలో పుట్టకపోయినా పదిమందిగల మధ్య తరగతి కుటుంబంలో పుట్టడంవల్ల అతనికి చిన్ననాటినుంచి డబ్బు సంపాదించడంమీద ఎంతో మోజు. డబ్బంటే ఎక్కడలేని వ్యామోహం. ఎంత ఎక్కువగా సంపాదించగలిగితే అంత మొనగాడని అతని అభిప్రాయం.

ఖరీదయిన తన ఆఫీసు రూములో అడుగు పెట్టగానే అతని వొళ్ళు జలదరించింది. సన్‌గ్లాస్ టేబుల్‌మీద మెరిసే పెన్‌స్టాండ్ - అన్ని కోణాల్లోంచి పూసిన పువ్వులు లోపల్నించి మెరిసే పేపర్ వెయిట్స్, రివాల్వింగ్ చైర్ పక్కనే ఎయిర్ కూలర్, విండోలకి నీలం సిల్కు కర్టెన్లు, గోడకి అందమైన ఆమెరికన్ లాండ్ స్కేపు క్యాలండర్, సభాపతికి మరింత దర్జాని తెచ్చి పెట్టాయి. వెంకన్న తెచ్చి డ్రాయరువి, క్యాబినెట్ వి తాళాలు అందించాడు. బీరువాలోంచి పువ్వుల గ్లాసుతీసి చల్లని మంచినీళ్ళు తెచ్చి టేబుల్‌మీదపెట్టి నిలబడ్డాడు.

వెంకన్నకి పదేళ్ళ ప్యూను సర్వీసు వుంది. అతనికి ఆఫీసర్లు కొత్త కాదు. వాళ్ళ అలవాట్లు, దర్పాలు, దర్జాలు, లోభత్వాలు, లోగుట్టులు, మంచితనాలు, మానవత్వాలు, నటనలు, న్యాయాలు అన్నీ తెలుసు. మనిషి ఆవలించకుండానే వాడిలోని అరవై గుణాలు పసికట్టగలవాడు, వెంకన్న. అతను ఏ ఆఫీసరు ముందూ వినయంగా వుండడు. కొంచెంసేపు వినయం అభినయిస్తాడు. అందులో కుర్ర ఆఫీసర్లంటే వెంకన్నకి మరీ చులకన. వాళ్ళకేమీ తెలీదనీ, తెలిసినట్టు పోజుపెట్టి డాంబికంగా నెట్టుకొస్తారని వాడి నమ్మకం. అందుకే వచ్చిన కుర్ర ఆఫీసరుకి ఉచితంగా తనే పాఠాలు చెప్తాడు. శిక్షణ యిస్తాడు. ఎక్కడెక్కడి వివరాలూ పేకరించి వాళ్ళ ముందుంచి వాళ్ళని ఎడ్యుకేట్ చేస్తాడు. వెంకన్న మంచి మాటకారి. వాడు ఏది చెప్పినా అందమైన కథలాగ, ఆకర్షణీయమైన సంభాషణతో చెప్తాడు అందులో వివిధ పాత్రలు తనే వివిధ గొంతులతో అభినయించి చెప్తాడు. అందులో విషయం వుంటుంది. హాస్యం వుంటుంది. అతిశయోక్తి

వుంటుదిం. వెంకన్న ఆఫీసరు ముందు చేతులు ముడుచుకుని నిల్చోడు. నిటారుగా అప్పుడప్పుడు కాస్త విలాసంగా నిలబడతాడు.

"నేను ఆఫీసులో అన్ని సెక్షన్సులోకీ వస్తున్నానని ఓ ఎమ్ కి చెప్పు" అని చెప్పి వెంకన్నని పంపేసి సభాపతి విశ్రాంతిగా కుర్చీలో జారగిలబడి గిర్రున తిరిగి మళ్ళీ యధాస్థానంలోకి వచ్చాడు.

తన సోదాని తల్చుకుని ఒక్కక్షణం మురిసిపోయినా తనకి ఆఫీసు పరిస్థితిగాని, దాని కార్యక్రమ విధానాలుగాని తెలీవని ఎదుటివాళ్ళు గ్రహించకుండా ఎలా కాపాడుకోవాలా అని ఆలోచించాడు.

తను ఒకరిద్దర్ని ఆంతరంగికుల్ని పెట్టుకుని నడిపించాలి. అంతా పూర్తిగా తెలుసుకున్నాక వాళ్ళని జాగ్రత్తగా దూరంలో వుంచవచ్చు అనుకున్నాడు.

సభాపతి ఆ రోజు తత్తరపాటుగానే వున్నాడు. ఆనందం, భయం, కంగారు అతన్ని కలవర పెడుతున్నాయి. ఒక్కక్షణం నీతీ, నిజాయితీ, న్యాయం, ధర్మం గుర్తుకొచ్చి నిరుత్సాహం కలిగినా, వెంటనే కార్య సాధనా, ధనార్జన, స్వల్ప కాలంలో సాధించబోయే ఘన విజయం అతన్ని విలతొక్కుకునేలా చేస్తున్నాయి.

వెంకన్న డోర్ తోసుకుని వచ్చి-

"సార్ ఆక్షన్ జరగబోతోంది మీరు నడవండి" అన్నాడు.

సభాపతి ధైర్యాన్ని కూడ దీసుకుని దర్జాగా నడిచాడు.

వేలం పాట వేగంగా సాగుతోంది. దినేష్ పాటెందుకు పెంచుతున్నాడో, ఆ పనికిరాని 'చెత్త'కి అంతెందుకు పాడాలో అర్థంకాక కొంత మంది తగ్గిపోయారు. స్క్రాప్ మెటీరియల్ మూడు వేలకి పాట ఆగిపోయింది. దినేష్ డబ్బు కట్టాడు. ఆ మెటీరియల్ లారీల కెక్కించారు.

ఆ రాత్రి సభాపతికి నాలుగువేల రూపాయలు తెచ్చి యిచ్చాడు వెంకన్న. మిగిలినది, చెత్త సామానులో విలువయిన వస్తువులు కలిపి దాటించటంలో సాయపడిన మిగిలినవాళ్ళు పంచుకున్నారు.

o o o

అప్పనంగా వచ్చే డబ్బు పెరిగేకొద్దీ సభాపతికి జీతం కంటికి ఆనడం మానేసింది.

సభాపతికి పెద్ద పెద్ద సంబంధా లొచ్చాయి. అతని హోదాని చూసి, చదువుని చూసి, అతను పని చేస్తున్న సంస్థను చూసి యిచ్చే కట్నానికి మరో యిరవై వేలు ఎక్కువే పలికింది.

"అబ్బాయికి పైనేమైనా ముడుతుందా?" అని అడిగిన మధ్య వర్తి—

దానికి సమాధానం విని "అబ్బా" అంటూ కనుబొమ్మ లెగరేసి, ఇరవై వేలు పైగా యిచ్చినా నష్టమేమీ లేదని సిఫార్సు చేశాడు.

అతని భార్య మహాలక్ష్మి నిజంగా శ్రీ మహాలక్ష్మి అన్నారు అంతా.

ఆమెకి భర్త సంపాదన ఎంత ఎక్కువయితే అంత ఆనందం. అంత దర్జా. అది ఎలాంటి సంపాదనా అనే విషయంకన్నా, అది ఎంత త్వరగా పెరుగుతోంది అనేదే ఆమెకి ముఖ్యం. భార్య ఆనందంకన్నా సభాపతికి కూడా మరొక ధ్యేయం కనిపించలేదు.

అతను పెళ్ళయినాక రెండు చేతులా సంపాదించడం మొదలు పెట్టాడు. అతని పెట్టుబడి స్క్రాప్ మీదనే. "చెత్త" అనే దానికి ప్రపంచంలో ఎంత విలువ వుందో సభాపతి బాగా అర్థం చేసుకున్నాడు.

అందుకే అతడు యింట్లో కూడ పాత గుడ్డ దగ్గర నుంచి చిన్న

కాగితం ముక్క వరకు దేన్నీ వేస్టు అని బయట పారేయ నిచ్చేవాడు కాదు.

కంచె చేనుని మేస్తే కనిపెట్టడమూ కష్టమే. కాపలా కాయడమూ కష్టమే.

డిపార్టుమెంటులోని విలువయిన సామాను చెత్తలో కలిసి స్క్రాప్ అనే పేరుతో బయట కెళ్ళిపోతుంటే అభివృద్ధి చెందవలసిన సంస్థ దిగ జారడం మొదలు పెట్టక తప్పదు.

ఉద్యోగం వచ్చిన అయిదేళ్ళలో దేవేంద్ర భవనంలాంటి యిల్లు కట్టి, అర్భాటంగా విందుచేస్తే కొందరు చెవులు కొరుక్కున్నారు. కాని వెంటనే మరికొందరు ఆ కొరికిన చెవులకు వైద్యం చేశారు.

"వాళ్ళావిడకి చాలా డబ్బుంది. ఆ పిల్ల చాలా కట్నంతో వచ్చింది. కాబట్టి ఆయన యిల్లు కట్టడంలో పెద్ద చోద్యమేంలేదు" అని మందు రాశారు.

ఇంట్లో ఫ్రిజ్ - ఇంటి ముందు సీమ కుక్క - ఇంట్లో కూలర్లు యింటిబయట డీలర్లు-ఇంటినిండా సౌఖ్యం-ఇంటి బయట లౌక్యం.

సభాపతి పని మూడు పూవులు ఆరుకాయలుగా వుంది.

o o o

ఆరోజు వెంకన్న వచ్చి "సార్ కొత్తగా వచ్చినాయన బలే మొండోడు. మాట చెవిని పెట్టేటులేడు సార్" అన్నాడు.

"మరే-అంతా నాలా మంచిగా వుంటారనుకున్నావా" అన్నాడు సభాపతి.

"నిజంసార్. వట్టి చేతగాని వాడిలా వుంటాడు. ముఖం మట మట లాడిస్తూ ఓర్నాయినా! ఆ ముఖాన్ని నవ్వే కనబడదు."

సభాపతి నవ్వాడు.

"దిస్ యీజ్ వరల్డ్. ఉయ్ మస్టనో హౌ టు విన్" అన్నాడు.

"అంతేకదా మరి" అన్నాడు వెంకన్న. అతనికి ఆఫీసర్లతో ఏక్వాత యెక్కువ కావడంవల్ల అంతర్జాతీయ భాష అవలీలగా అర్థమవుతుంది.

"అతనంతా బాగుచెయ్యటాని కొచ్చినట్లు పెద్ద ఫోజులో వున్నట్లుగా వున్నాడు. ఓయబ్బో అందర్నీ ఆమడ దూరంలో ఉంచుతున్నాడు.

ఆయనకేం తెలీదు నిజంసార్. తెలీకకాక తెలీదు. అయినా ఏదైనా విషయం లాగాలంటే మనుషులందర్నీ దూరం దూరం అంటే ఎట్టా కుదుర్తుంది?

"కరెక్ట్! వుయ్ కెన్ లెరన్ ఎవ్విత్రింగ్ ఫ్రమ్ పీపుల్" అన్నాడు సభాపతి కుర్చీలో విలాసంగా అటూ యిటూ వూగుతూ.

"అది సరేగాని సార్. ఒక్కొక్క ఫైలు గంటలతరబడి తిరగేస్తూ మొదటి కాగితంనుంచి చివరికంటా చదువుకుపోతున్నాడు. అయినా ఆయన పిచ్చిగానీ, కాగితాల్లో ఏం దొరుకుతుంది?" అన్నాడు వెంకన్న.

"దొరకటానికేముంది? ఈ ప్రపంచంలో న్యాయం, ధర్మం ఎక్కడున్నాయి. చెప్పు. కోట్లు కోట్లు తినేస్తున్న వాడిగురించి ఎవ్వరూ పట్టించుకోరు. చిన్నవాళ్ళే వాళ్ళకి దొరుకుతారు. మనమేమిటి ఏదో పొట్ట గురించి నాలుగురాళ్ళకోసం పాకులాడతాం. నిజమైన దొంగల్ని ఎవ్వరూ పట్టలేరు. అదే మన దౌర్భాగ్యం. అసలు మనదేశంలోనే లేదు నిజాయితీ. ప్రతివాడూ ఎదుటవాడిని దోచుకుని తిందామను కునేవాడే" అని సభాపతి ఊపిరి పీల్చాడు.

"నిజం చెప్పారు సార్-అయినా సార్, ఆ కొత్తాయన విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండండిసార్. ఆయనకి సెంట్రల్‌లో గొప్ప పరపతి వుందిట" అన్నాడు వెంకన్న.

"ఆ...మన్నేం చేస్తాడు? ఇవతలివాళ్ళు దద్దమ్మలుకారు. గాజులు తొడిగించుకునీ లేరు" అంటూ చప్పరించేశాడు సభాపతి.

o o o

"సార్. మీకో విషయం చెప్పాలి" అన్నాడు దినేష్ కాస్త స్వరం తగ్గించి.

"ఏమిటి"

"మొన్న ఆక్షన్‌లో కొన్ని ఎమ్టీ బారల్సులో మూడు ఆయిల్‌తో వుంటాయన్నారు. కాని రెండేవున్నాయి సార్" అన్నాడు.

"ఈజిట్" ఆశ్చర్యపోయాడు సభాపతి.

"అవునుసార్. నేనదే ఆలోచిస్తున్నాను" అన్నాడు దినేష్.

"సరే. దాని గురించి నేను ఎంక్వయిరీ చేస్తా. మనవాళ్ళంతా చాలా నమ్మకమైనవాళ్ళు. నేను చూసి....ఐవిల్‌డు సమ్‌థింగ్".

"ఓకే. సార్. మీరు మాటంటే చాలు. మీ నిజాయితీ, నిక్కచ్చితనం నాకు తెలీదా సార్.

సభాపతి నవ్వాడు. అతని నవ్వులో గర్వం వుంది. "వ్యాపారంలో నిజాయితీ ఉండాలి సార్. నిజంగా అది మీలో చూసినంత మరెక్కడా చూడలేదు" అన్నాడు దినేష్.

"అన్యాయంచేసి ఎన్నాళ్ళు బ్రతుకుతాం. నా వుద్దేశంలో నలుగురు కలిసి ఒకమాట అనుకుంటే ఆ మాటమీద నిలబడాలి. అందులో కుట్రలు, ఎత్తుకు పైఎత్తులు నాకిష్టం ఉండవు" అన్నాడు సభాపతి.

"నే వస్తాను సార్" అంటూ లేచాడు దినేష్.

"ఓ. కే"

"వచ్చేసారి అది కాస్తా వచ్చేలా చూడండి సార్."

దినేష్ వెళ్ళిపోయాక సభాపతి ఆలోచనలో పడ్డాడు. తను వెంకన్న ద్వారా ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఎమ్టీ బారల్సులో ఆయిల్‌తో వున్నవి వుండేలా సర్దించాడు. అయితే అందులోంచి ఒకిటెలా మాయమైంది? కళాసీలంతా తన కనుసన్నలలో మసులుతారు. తనెప్పుడూ వాళ్ళభాగం యివ్వడంలో అన్యాయం చెయ్యలేదు. ఇదెలా జరిగింది? ఎవరైనా పసికట్టారా - ఆలా అయితే మొత్తానికి పట్టేసుకోక ఈ విధంగా ఎందుకుచేశారు? మధ్యన మరొకడెవడో దూరాడు. వాడి విషయం చూసుకోవాలి. లేకపోతే ప్రమాదం" అనుకున్నాడు సభాపతి.

o o o

ఆఫీసులన్నీ అట్టుడికి పోతున్నాయి. తెల్లారకుండా వార్త దావానలంలా వ్యాపించింది. రాత్రి వర్క్‌షాపులోని మెటీరియల్ స్క్రాప్‌యార్డులోకి చేరుస్తుంటే కొంతమందిని పట్టుకున్నారు. అందులో సుమారు పది మంది ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. మరికొందరు ఆఫీసర్లకి కూడా ముప్పు రాబోతోందని గుప్పుమంది.

సభాపతి టెలిఫోన్ నిమిషం విరామం లేకుండా ఎవరో ఒకర్ని, సభాపతికి కనెక్టు చేస్తూనే వుంది. అతను తనకున్న పరపతిని, ధనాన్ని మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెట్టి తనవైపు కేసు తిరక్కుండా చూసుకున్నాడు.

o o o

హాస్పిటల్ వాతావరణం నిశ్శబ్దంగా వుంది.

సభాపతి కోమాలో వున్నాడు. అతని వయసు నలభై ఎనిమిదేళ్ళు. అయినా అతను విశ్రాంతి లేకుండా పనిచెయ్యడంవల్ల అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. అతని రోగం కనిపెట్టలేకపోయినా వైద్య లోపం లేకుండా అంతా కాపుకాసి వున్నారు.

సభాపతి తాను చిన్నపిల్లాడై తల్లి దగ్గర పాలు తాగుతున్నట్లు, కడుపునిండా తాగి రొమ్ముమీద కత్తివిసిరినట్లు, పాలుకారే రొమ్ములోంచి రక్తం చిమ్ముతున్నట్లు-కలలో కనిపిస్తోంది. ఫోమ్ రబ్బర్ గాలిలో ఎగురుతున్నట్లు, ఖాళీగా వుండే ఆయిల్ పీపాలు దొర్లిపోతున్నట్లు-అయిపోయిన బ్యాటరీలోంచి ఆవిర్లు వస్తున్నట్లు-

మేఘాల్లోంచి పిప్పన్స్ వర్షంగా కురుస్తున్నట్లు-

ఆకాశం వంగిన అల్యూమినియమ్ షీట్‌లా మెరుస్తున్నట్లు భ్రమ కలుగుతోంది. సభాపతి అస్వస్థతగా కదులుతున్నాడు.

"సార్ - సార్, యిది మురికి కాలువనుకున్నారా కాదు సార్ - స్క్రాప్ ఆయిల్ సార్ నిజంసార్, అంటున్నారెవరో, అతనెవరో గుర్తు రావడంలేదు. ఎంతో పరీక్షగా చూస్తే వెంకన్నలా అనిపిస్తున్నాడు. కాస్సేపటికి అతని రూపం మారిపోయి యమభటునిలా అనిపిస్తున్నాడు. మూల కూర్చుని ఒక ముసలమ్మ వికారంగా వుంది. ఎవరామె అని యెంతసేపో మథనపడ్డాడు. కాని తెలీటంలేదు. ఎప్పుడో చచ్చిపోయిన తల్లి ముఖం గుర్తుకు రావడంలేదు. ఆమె లేచి, నెమ్మదిగా వెళ్ళిపోతోంది. అదేమిటి చిత్రం. ఆమె వీపుమీద తన డిపార్ట్‌మెంటు ఎమ్బ్లమ్ చూసి వులిక్కిపడుతున్నాడు.

సభాపతి కొడుకు సీతాపతి తండ్రి ప్రాణాలకి భయంలేదని తెలిసి స్తిమితపడ్డాడు. సభాపతిది అంతా స్వార్జితం. అందుకని తన ఆస్తిని

వెంటనే విల్లురాయించి వుంచడం మంచిదని లీగల్‌గా చెప్పడంవల్ల సీతాపతి తొందరపడ్డాడు. యిరవై నాలుగు గంటలు గడవాలన్నారు, డాక్టర్లు. గడిచాయి. సభాపతి ఆస్తి సీతాపతికే చెందేటట్లు సర్వత్ర సంతకాలు వెలిశాయి.

సభాపతి కోలుకున్నాడు. అతనిలో భక్తి ప్రబలింది. భయం కూడా పెరిగింది.

కొడుకు డబ్బు తగలేస్తాడేమోనని అనునయించ బోయాడు సభాపతి. అయితే ఆస్తంతా తన చేతిలో వున్న సీతాపతి తండ్రి నంతగా పట్టించుకోడు. ఒకరోజు కోడలు కొడుకుని నిలేస్తుంటే సభాపతి చెవిని పడింది.

"ఈ సినిమాలు, రేసులు మనకి కలసివస్తాయో రావో - డబ్బంతా పోతుంది. అయినా మీ నాన్నగారు చెవులో యిల్లుకట్టుకుని పోరుతున్నారు. ఆయన మాట కాస్త వినండి" అంది.

"సర్లే నాన్న మాటలకేం, ఆయనపని అయిపోయింది ఆయన పనికిరాని చెత్తమీద పెట్టుబడి పెట్టి దాన్ని రెండింతలు చేస్తాడు. నేను పనికొచ్చే దానిమీద డబ్బు పెట్టి పదింతలు చేస్తాను. నాన్న మాటలు ఒక చెత్త - నాన్నే ఒక స్క్రాప్. నువ్వేం పట్టించుకోకు" అన్నాడు సీతాపతి.

ఈ మాటలు సభాపతి చెవిని పడి గుండెల్లో ములుకుల్లా గుచ్చుకున్నాయి. తను స్క్రాపా? కానేకాదు. పనికొచ్చే తనని పనికిరాని చెత్తలా తన కొడుకే జమ కట్టేస్తున్నాడు.

అతని హృదయం ఆక్రోశించింది. తను స్క్రాప్ కాదు, అని, ఇది తను చేసుకున్న పాపం అనిపించిందతనికి.